618) సౌరాష్ట్రం

ప॥ మరల విచారించితే మంచముకిందే నుయ్యి। శిరుల హరివారైరి శివాదులు॥

చ॥ ఆడేటిమాటలకెల్ల నాది నంతము లేదు। వీడనికర్మములకు విధి లేదు।
రాటుపడ్డమనసుకు దైవము విష్ణుడేయని। పాడి కొలిచిరి తొల్లి బ్రహ్మాదులు॥

చ॥ పుట్టిపడేజన్మముల కూరట యెందూ లేదు। కట్టిడి ఇంద్రియాలకు గతి లేదు।
తట్టువడ్డజీవునికి దైవము శ్రీహరియని। యిట్టె మొరయిడిరి యింద్రాదులు॥

చ॥ కప్పినయీమాయలకు కడవ రెందూ లేదు। తిప్పనిహరిభక్తికి దిరుగు లేదు।
వొప్పుగా శ్రీవేంకటేశు డొక్కడే దైవమని। చొప్పువట్టి కొలిచిరి శుకాదులు॥